సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 9 । జూలై । 2023



● ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శనివారం ఇడుపులపాయలో వైఎస్సార్ విగ్రహానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ మదనపల్లె పర్యటన..?

● ఏర్పాట్లను పరిశీలించిన జేసీ



బీటీ కళాశాలలో కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మదనపల్లె: కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ మదనపల్లె పర్యటనకు రానున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. శనివారం కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించి ఆయన మదనపల్లె బీటీ కళాశాల గ్రౌండ్స్‌లో హెలిప్యాడ్, నక్కలదిన్నెలోని సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ్య ఆస్పత్రిని పరిశీలించారు. ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఎస్పీ కేశప్ప, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, కమిషనర్ కే.ప్రమీల, నేషనల్ హైవే అధికారులతో మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ మదనపల్లె పర్యటన అధికారికంగా ఇంకా ఖరారు కాలేదన్నారు. కలెక్టరేట్‌కు అందిన సమాచారం మేరకు ఏర్పాట్ల పరిశీలనకు వచ్చామన్నారు. జూన్ 12న పట్టణంలోని సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ శ్రీఎం(ముంతాజ్‌అలీ) నిర్మించిన స్వాస్థ్య ఆస్పత్రి ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ హాజరవుతారన్నారు. అధికారికంగా షెడ్యూల్ ఖరారైన వెంటనే పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ డీఈ శివరాం, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, డీఈ శ్రీనివాసులు, ఏఈ బుర్రయ్య, సీఐలు సత్యనారాయణ, మహబూబ్ బాషా, ఆర్ఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సైనికులకు ధన్యవాదాలు

● అశ్రిత పక్షపాతం, అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ లబ్ధి
● పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సింహాద్రిపురం మండల నాయకులతో సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం.. అలుపెరగకుండా శ్రమిస్తున్న సింహాద్రిపురం మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులకు,ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సహకారం అందిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం వైఎస్ఆర్ ఘాట్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు ముగించుకుని ఇడుపులపాయ నెమళ్లపార్కు వద్దకు చేరుకున్నారు.అక్కడి ప్రేయర్ హాలులో సింహాద్రిపురం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి.. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 'నాన్న చనిపోయాక.. మీరంతా అందించిన ప్రోత్సాహం, సహకారం, మనోధైర్యంతో ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీ ముందు నిలిచి మీ అందరి మేలు కోసం పాటుపడుతున్నాను...'అంటూ.. పులివెందుల సొంత నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండల ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సవినయంగా తెలియజేశారు. ఈ సందర్భంగా... పాడా అభివృద్ధి పనుల పురోగతిపై.. ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ వి విజయ్‌రామరాజు క్లుప్తంగా వివరించగా... సింహాద్రిపురం మండలం పరిధిలో పాడా, ఇతర శాఖల ద్వారా జరుగుతున్న మొత్తం అభివృద్ధి పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి వివరించారు.

రైతు దినోత్సవం నాడే

మండలానికి సంబంధించి రూ.17 కోట్ల క్రాప్ ఇన్సూరెన్స్ కూడా మండల రైతులకు అందిందని.. నష్టపోయిన ప్రతి చీనీ రైతుకు ఈసారి నష్టపరిహారం అందిందని మండల రైతులు ప్రభుత్వం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాలు, అలాగే 70% సబ్సిడీతో మైక్రో న్యూట్రీయంట్స్ అందివ్వాలని కోరారు. ఉద్యాన శాఖకు సంబంధించి సింహాద్రిపురం మండలం ముద్దనూరు డివిజన్ పరిధి నుంచి పులివెందుల డివిజన్‌లో విలీనం చేయాలని కోరారు. సోయాబీన్ పంట సాగుకు సబ్సిడీ విత్తనాలు అందివ్వాలని విన్నవించారు. అరటి పంట నారు కోసం అరటి పిలకల పంపిణీ చేయాలని ముఖ్యమంత్రిని పలువురు రైతులు కోరారు. పైడిపాలెం ఆర్ అండ ఆర్ ప్యాకేజీ క్రింద రూ.32 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. దీనికి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ..పెండింగ్ లో ఉన్న 61 మందికి సంబంధించి సోషల్ ఆడిట్ చేపట్టి పరిహారం త్వరగానే అందేలా చర్యలు చేపడతామన్నారు. చిత్రావతి, పైడిపాలెం ప్రాజెక్టుల్లో పూర్తి సామర్థ్యంతో నీళ్ల నిల్వ చేయడం కోసం వందల కోట్లు ఖర్చు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రాజెక్టులకు సంబంధించి ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సింహాద్రిపురం మండలం కొనసీమ లాగా పచ్చదనంతో కలకళలాడుతోందన్నారు. ఎన్నో ప్రాంతాలు నీరులేక అల్లాడుతుంటే.. మీ పుణ్యమా అని పైడిపాలెం రిజర్వాయర్ లో పూర్తి స్థాయి నీటిమట్టం ఉంచడంతో సాగునీటి పరంగా రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. అయితే అధిక నీటి నిల్వ కారణంగా చిన్నపాటి లీకేజీలు ఏర్పడ్డాయని, మరమ్మతులు చేపట్టాలని నంద్యాలంపల్లె రైతు తెలియజేశాడు. స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి "రిజర్వాయర్ల పరిసర ప్రాంత గ్రామాల్లో గ్రామస్థులకు, రైతులకు ఎదురయ్యే సమస్యలను పూర్తి వివరాలతో స్వీకరించి అందుకు అధికారులు చేపట్టే పరిష్కార మార్గాలు, ఫలితాలు బాధితులకు సంతృప్త స్థాయిలో ఉన్నాయో లేదో వారితో నిర్ధారించుకొని ముందుకు సాగాలన్నారు. వారికి పరిహారం కూడా అందించే ప్రక్రియ రానున్న నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాయకులందర్నీ సీఎం పేరు పేరున పలుకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కలెక్టర్ విజయరామరాజు తదితరులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
● జిల్లాలో 9.89 కోట్ల ఉచిత పంటల బీమా రైతు ఖాతాలకు జమ

రాయచోటి: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శనివారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం వేదిక నుంచి వైఎస్సార్ రైతు దినోత్సవం సందర్భంగా వరుసగా నాల్గో ఏడాది 2022 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతన్నలకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా విడుదల చేశారు. అన్నమయ్యజిల్లా కేంద్రం, రాయచోటి నారాయణ కల్యాణ మండపంలో ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ఉచిత పంటలు బీమా పరిహారం విడుదల మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరుసగా నాలుగో ఏడాది డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకం నిధులను అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి 2022 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన 48,780 మంది రైతులకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమాలో రూ. 9.89 కోట్లు ముఖ్యమంత్రి విడుదల చేశారని తెలిపారు. జిల్లా వ్యవసాయసలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా రైతులకు ఆర్థికభారం లేకుండా ఈ క్రాప్ బుకింగ్ ద్వారా అమలవుతున్న పథకమన్నారు. ఈ పథకం ద్వారా అన్నమయ్య జిల్లాకు రూ. 9.89 కోట్లు మంజూరు కావడం హర్షనీయమన్నారు. అనంతరం 2022 ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతన్నలకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారానికి సంబంధించి రూ. 9,89,43,850 మెగా చెక్కును రైతులకు జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఏపీసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, రాయచోటి ఎంఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యులు రమణ, రత్నమ్మ, ఏఎంసీ చైర్మన్ లక్కిరెడ్డిపల్లి విశ్వనాథ్ రెడ్డి, రైల్వేకోడూరు ఏఎంసీ చైర్మన్ సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు

మిషన్ విజన్...
ఫెయిలైన విద్యార్థులకు వరం

● పది, ఇంటర్ తప్పిన విద్యార్థులు 'మళ్లీ బడి'కి
● వందశాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సాధనే లక్ష్యం
● విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం

మదనపల్లె సిటీ: బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి. అందరికీ గుణాత్మక విద్య అందించాలి. అందరూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు చదవాలి. వారంతా ప్రయోజకులు కావాలన్నదే జగనన్న కల. అయితే కొందరు పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలై తమ చదువులను అర్ధంతరంగా ఆపేస్తున్నారు. ఫలితంగా విద్యావంత సమాజ నిర్మాణానికి ఆటంకం కలుగుతోంది. ఫెయిలైన వారికి మరో అవకాశం కల్పించాలనే లక్ష్యంతో జగనన్న రూపొందించిన కార్యక్రమమే మిషన్ 100 గ్రాస్ ఎన్రోల్‌మెంట్. పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఎదుర్కొనే తొలి పబ్లిక్ పరీక్ష పదో తరగతి. వీటిలో ఫెయిలైతే సప్లిమెంటరీ రాసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో కూడా ఫెయిలైతే పదో తరగతి ఉత్తీర్ణత పొందే వరకు సప్లిమెంటరీ పరీక్షలు రాస్తూనే ఉండాలి. అయితే ప్రభుత్వం తాజాగా తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం టెన్త్, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులకు వరంగా మారింది. వీరికి తిరిగి రెగ్యులర్‌గా చదువుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు వలంటీర్ల ద్వారా మిషన్ విజన్‌పేరుతో జిల్లాలో ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ అమలు చేస్తున్నారు. దీని ద్వారా ఫెయిలైన విద్యార్థులను పాఠశాలలు, కాలేజీల్లో చేర్పించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నా, మెరుగైన జీవనోపాధి పొందాలన్నా టెన్త్, ఇంటర్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తల్లిదండ్రులు, విద్యార్థులు,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న డీవైఈఓ, ఉపాధ్యాయులు

జిల్లాలో టెన్త్ ఫలితాలు

హాజరు	ఫెయిల్
22219	6,210

ఇంటర్ ఫలితాలు

హాజరు	ఫెయిల్
17065	6,835

పెరిగిన జీఈఆర్

నాలుగేళ్లుగా ప్రభుత్వం 100 శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సాధనకు కృషి చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే ఆయా ఉప విద్యాశాఖ అధికారుల నేతృత్వంలో పది ఫెయిలైన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక డ్రైవ్ ద్వారా వారిని పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా జగనన్న అమ్మ ఒడి,విద్యార్థుల ఆరోగ్యానికి జగనన్న గోరుముద్ద పథకం, బైలింగ్విల్ పాఠ్యపుస్తకాలు ప్రవేశపెట్టింది. జెవీకే ద్వారా ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్నారు. 2005 సెప్టెంబర్ ఒకటి నుంచి ఆగస్టు 3వతేదీ వరకు ప్రతి ఒక్కరూ ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఏదో తరగతి చదువుతూ ఉండటమే ఈ కార్యక్రమ లక్ష్యం. మిషన్ 100 శాతం జీఈఆర్ సాధనలో భాగంగానే పది,ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు తిరిగి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. వీరికి జగనన్న అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనున్నారు.

అద్భుత అవకాశం



టెన్త్, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు తిరిగి రెగ్యులర్‌గా చదువుకునేందుకు అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. వారికి ఇదో అద్భుత అవకాశం. రెగ్యులర్‌గా చదువుకునే అవకాశం ఉండటంతో ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలు పొందే అవకాశం ఉంటుంది. విద్యకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యం కారణంగా నాలుగేళ్లల్లో జీఈఆర్ గణనీయంగా పెరిగింది. –క్రిష్ణప్ప, డీవైఈఓ,మదనపల్లె.

ప్రభుత్వ నిర్ణయం భేష్



టెన్త్ ఫెయిలైన విద్యార్థులు తిరిగి పాఠశాల్లో చేరుతున్నారు. వీరిని రెగ్యులర్ విద్యార్థిగా గుర్తిస్తున్నాం.ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధిస్తాం. దీంతో జీఈఆర్ పెరుగుతోంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.
–పి.మహమ్మద్‌ఖాన్, టీచర్, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

మంచి అవకాశం



నా పేరు ఉదయ్‌కిరణ్. పదో తరగతి తప్పాను. చదువు మానేస్తామనుకుంటే ఉపాధ్యాయులు వచ్చి తిరిగి పాఠశాలలో చేరమని చెప్పారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు నన్ను చేర్పించారు. ఈసారి తప్పకుండా పాస్ అవుతాను. ప్రభుత్వం మంచి అవకాశం ఇచ్చింది.

కారుణ్య నియామక పత్రాల అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ మృతి చెందిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. గతంలో కొందరికి అందజేయగా, అప్పుడు రాని ముగ్గురికి శనివారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా నిలబడి కారుణ్య నియామకాలను చేపట్టిందన్నారు. కాగా ప్రస్తుతం పత్రాలు అందుకున్న వారు శిక్షణ నిమిత్తం ఆయా కేంద్రాలకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అల్లాబకష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిని చంపిన దత్తపుత్రుడు అరెస్ట్



నిందితుడు షేక్ కరీముల్లాను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఓబులవారిపల్లె : తల్లిని చంపిన దత్తపుత్రుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నఓరంపాడు గ్రామంలో ఈనెల 6న షేక్ చాంద్ ఫ్యారీ (67) అనే వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నిందితుడైన మృతురాలి దత్తపుత్రుడు షేక్ కరీముల్లాను అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీకాంత్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న అర్ధరాత్రి షేక్ కరీముల్లా కర్రతో తన తల్లి చాంద్ ఫ్యారీని తలపై తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఆస్తి కోసం ఈ ఘటనకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడు కరీముల్లాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

చెరువును కబ్జా చేసిన టీడీపీ నాయకుడు



చెరువు భూమికి కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు చెరువులో దాదాపు నాలుగు ఎకరాలను మండల స్థాయి టీడీపీ నాయకుడు కబ్జా చేసి కంచె ఏర్పాటు చేశాడు. చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 2562లో 135 ఎకరాల్లో చెరువు ఉంది. జాతీయ రహదారి సమీపంలో, నీరు లేక ఖాళీగా ఉండటంతో కబ్జాదారులు కబ్జాకు పాల్పడుతున్నారు. దాదాపు నాలుగు ఎకరాల చెరువు భూమిని యంత్రాలతో చదును చేసి కంచె ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కబ్జాలను అడ్డుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఇసుక టిప్పర్ బోల్తా

సిద్దవటం : మండలంలోని భాకరాపేట– సిద్దవటం మార్గంమధ్యలోని ప్రభుత్వ మద్యం షాపు సమీపంలో ఉన్న కల్వర్టులో శనివారం సాయంత్రం ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. సిద్దవటం మండలంలోని ఎస్.రాజంపేట సమీపంలో ఉన్న పెన్నా నదిలో ఇసుకను టిప్పర్ నింపుకొని కడపకు వెళ్తోంది. కల్వర్టు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కల్వర్టులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

● ఆహ్వానం



వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఇడుపులపాయకు వచ్చారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్‌లో ఆయనకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు





మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జకియాఖానం, డీఐజీ సెంథిల్‌కుమార్



కలెక్టర్ వి.విజయరామరాజు



ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



జేసీ గణేష్‌కుమార్

వైఎస్ కలల ఫలితమే రిమ్స్

కడప అర్బన్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కలల ఫలితమే కడప రిమ్స్ అని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. శనివారం కడప పర్యటనకు వచ్చిన ఆయన మొదట రిమ్స్‌లో పర్యటించారు. ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)కు విచ్చేసిన ఆయనకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, మానసిక వైద్య విభాగం సీనియర్ వైద్యుడు డాక్టర్ వెంకటరాముడు, రిమ్స్ శానిటేషన్ అండ్ సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్టర్ జె.బాలనారాయణరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాబ్జి విద్యార్థులు, అన్ని విభాగాల హెచ్ఓడీలతో కలసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నా లక్ష్యంతో రిమ్స్ నిర్మించారన్నారు. అనంతరం ప్రభుత్వ దంతవైద్య కళాశాల వద్ద డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి బాబ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేసి అక్కడున్న వారికి పంచిపెట్టారు. ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న, సీనియర్ వైద్యుడు డాక్టర్ బాలసుబ్రమణ్యం దంతవైద్య కళాశాలలోని సమస్యలను బాబ్జి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బాబ్జి నిర్మాణం పూర్తి చేసుకున్న మానసిక వైద్యశాలను, నిర్మాణ దశలో వున్న కేన్సర్ హాస్పిటల్‌ను సందర్శించారు.



రిమ్స్‌లో ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఆవరణలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ బాబ్జి

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

పులివెందుల : ప్రజల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చెరగని ముద్ర వేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పులివెందులలోని కడప రోడ్డులో గల వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డిలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పార్టీ నాయకులు, అభిమానులకు పంపిణీ చేశారు. తరువాత అదే కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ జయంతి రోజున రైతు దినోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు రూ.1120 కోట్ల పంటల బీమా అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడి రమణ, కోళ్ల భాస్కర్, రసూల్, చంద్రమౌళి, బ్యాటరీ ప్రసాద్, గూడూరు ప్రసాద్, వెంకటసుబ్బయ్య, వీరారెడ్డి, డేనియల్‌లతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

గొప్ప దార్శనికుడు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థులు

వేంపల్లె : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గొప్ప దార్శనికుడు అని సియంట్ ఫౌండర్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా స్థానిక ఆర్జీయూకేటీలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'బిల్డింగ్ బ్రిడ్జెస్ బ్రేకింగ్ లిమిట్స్: ఎంబ్రాస్ ద ఇంజనీర్ ఇన్ యు' అనే అంశంపై వైఎస్సార్ మెమోరియల్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించి భావి తరానికి మెరుగైన ఇంజనీర్‌ను అందించే ఉద్దేశంతో ఆర్జీయూకేటీని స్థాపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల చాన్సలర్ కె.సి.రెడ్డి, వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్, ఆర్కే వ్యాలీ డైరెక్టర్ కె.సంధ్యారాణి, న్యాక్ అడ్వయిజరీ కమిటీ మెంబర్స్ వి.ఎస్.రావు, మోహన్‌రావు, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి పంచాయతీ ఆవులరెడ్డిపల్లిలో ఇంటి ఎదుట మురుగు నీటి విషయంలో ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో పి.శంకర్ (32) అనే వ్యక్తి వేదాంతమ్మ అనే మహిళపై దాడి చేయడంతో తలకు గాయమైంది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎంతో కృషి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ విజయమ్మ, షర్మిల

వేంపల్లె : తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో కృషి చేశారని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. శనివారం వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, కుమార్తె షర్మిల, మనుమడు రాజారెడ్డి, మనుమరాలు అంజలి, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ చేరుకుని వైఎస్సార్ సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షర్మిల విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, రుణ మాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనారీలకు 4 శాతం రిజర్వేషన్, ఐదేళ్లలో పేదలందరికీ 46 లక్షల ఇళ్ల నిర్మాణం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం ఒక్క వైఎస్సార్‌తోనే సాధ్యమైందని తెలిపారు. వైఎస్సార్‌ను ప్రేమించే, అభిమానించే ప్రతి ఒక్కరికీ వైఎస్ కుటుంబం తరపున పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ నాయకులు, కార్యకర్తలు, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, పెద్దసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

● సుందరం.. సుమనోహరం




పులివెందులలోని గరండాల రివర్ ఫ్రంట్, వైఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు సుందరం, సుమనోహరంగా కనిపిస్తున్నాయి. శనివారం రాత్రి విద్యుత్ కాంతులతో ధగధగలాడాయి. వీటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఎస్వీ మెడికల్ కాలేజీ వైద్య బృందం



మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయ భవనంలో చర్చిస్తున్న ఎస్వీ మెడికల్ కాలేజీ వైద్య బృందం

మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఎస్వీ మెడికల్ కాలేజీ వైద్యబృందం శనివారం పరిశీలించింది. ఎస్వీ మెడికల్ కళాశాల వైద్య బృందం, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ బృందం ఉమ్మడిగా మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ బృందంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వసుంధరదేవి, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కిరిటీ, జనరల్ సర్జరీ నిపుణులు శ్రీకాంత్‌రెడ్డి, అనాటమీ ప్రొఫెసర్ జగదీష్, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనుంజయరెడ్డిలు ఉన్నారు. వారు స్థానిక జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్‌రాజులతో కలిసి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని, ప్రసూతి, మేల్, ఫిమేల్, క్యాజువాలిటీ, హెచ్‌డీయూ, ఎస్ఎన్‌యూ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఇటీవల పూర్తయిన భవనాలను నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో 2024–25 నుంచి మెడికల్ కాలేజీ ప్రారంభానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు గాను ఇక్కడ ఉన్న మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. కాలేజీ ప్రారంభానికి సాధ్యాసాధ్యాల పట్ల అధికారులు ఉమ్మడిగా మెడికల్ ఆఫీసర్ కార్యాయంలో చర్చించారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో 150 పడకలతో ఉండగా, మెడికల్ కాలేజీ ప్రారంభించేందుకు 300 పడకలకు అనుమతి రావాల్సి ఉందన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా జిల్లా ఆస్పత్రిలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుకునేందుకు తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆర్ఎంఓ తెలిపారు. తాము పరిశీలించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. మెడికల్ కాలేజీ ప్రారంభంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. తమ పరిశీలనలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కావాల్సిన సదుపాయాలపై నివేదిక వివరాలను పొందుపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగం డీఈలు కరీముల్లాఖాన్, చలపతి, ఏఈలు రాజేష్ రాఘవ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం పూరవాండ్లపల్లెకు చెందిన రామమోహన్‌రెడ్డి(26) శుక్రవారం రాత్రి ఇంటి వద్ద విషం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇటీవల తన కుమార్తె అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో మనస్తాపం చెందిన ఆయన ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె మండలం చీకలబైలుకు చెందిన రమణ కుమారుడు వెంకటేష్(20) కుటుంబ సమస్యల కారణంగా శుక్రవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ నేమలగుండ్లపల్లెకు చెందిన హరిప్రసాద్ భార్య లక్ష్మీదేవి(30) కుటుంబసమస్యల కారణంగా శనివారం ఉదయం గన్నేరుపప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కనుల పండవగా పుష్పయాగం

రాజంపేట : తాళ్లపాకలో శనివారం పుష్పయాగం కనుల పండువగా జరిగింది. శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామికి పుష్పయాగం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా తిరుమల నుంచి తెచ్చిన వివిధ రకాల పుష్పాలతో స్వామి వార్లకు వేదపండితులు కైంకర్యాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లపాక టెంపుల్ ఇన్‌స్పెక్టరు బాలాజీ, సర్పంచి గౌరీశంకర్, టీటీడీ హిందు ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

చౌక బియ్యం పట్టివేత




బియ్యం, లారీని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు, పోలీసులు

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు సమీపంలో శనివారం లారీలో అక్రమంగా తరలిస్తున్న 390 బస్తాల (185క్వింటాళ్ల) ప్రభుత్వ చౌక బియ్యాన్ని పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు కడప విజిలెన్స్ అధికారి జి.ఇదురు బాషా స్వాధీనం చేసుకొని రామాపురం పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ కొండారెడ్డి శనివారం తెలిపారు. చెన్నూరు మండల నుంచి బెంగళూరుకు అక్రమంగా ప్రభుత్వ బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా విజిలెన్సు అధికారులు సిబ్బందితో కలిసి గువ్వలచెరువు వద్దకు రాగానే పట్టుకున్నారు. బియ్యాన్ని లక్కిరెడ్డిపల్లె గొడౌన్‌లో ఉంచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

'ఉపాధి'లో వసూల్ రాజాలు లేరు

– ఏపీడీ ఎదుట తేల్చిచెప్పిన కూలీలు



ఉపాధి కూలీలను విచారణ చేస్తున్న ఏపీడీ రెడ్డప్పనాయుడు

గాలివీడు : మండలంలో ఉపాధి హామీ పథకంలో వసూలు రాజాలు లేరని లక్కిరెడ్డిపల్లె ఏపీడీ రెడ్డప్ప ఎదుట ఉపాధి కూలీలు తేల్చిచెప్పారు. మండలంలో గతంలోని ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో ఉపాధి కూలీలకు సమయానికి డబ్బులు చెల్లిస్తున్నారని వారు తెలియజేశారు. పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఏపీడీ రెడ్డప్ప నాయుడు పలు గ్రామాల్లో శనివారం పర్యటించి ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఉపాధి సిబ్బంది కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారా అని అడగగా... కూలీలు స్పందిస్తూ డబ్బులు తమ ఖాతాలో జమ అవుతున్నాయని, ఎవ్వరికీ డబ్బులు ఇవ్వడం లేదని తెలియజేశారు. అనంతరం ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమై ఎక్కడే గానీ అవినీతి జరిగినట్లు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.